క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గో పూజ


గోపూజ చేస్తున్న పూజారులు, పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్ట పాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అభిషేకం, అర్చన, గో పూజ, మహా నివేదన, పల్లకీసేవ తదితర పూజలు చేశారు. మహా నివేదన పూజలలో భాగంగా భక్తులు పొంగళ్లు చేతబూని స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి సత్యనారాయణశర్మ ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి భక్తులకు వసతి సౌకర్యాలు సమకూర్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

హనుమంతునిపాడు: మండలంలోని రామాయపల్లి గ్రామ పొలాల్లో ఆదివారం కోడిపందేల స్థావరంపై ఎస్సై కృష్ణపావని సిబ్బందితో మెరుపుదాడులు నిర్వహించారు. దాడిలో ఏడుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2 కోళ్లు, రూ.10,260 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అదుపు తప్పిన కారు

కందుకూరు రూరల్: మండలంలోని మాచవరం గ్రామ సమీపంలో మన్నేరు వద్ద కారు అదుపు తప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కందుకూరు నుంచి గుడ్లూరు వైపు వెళ్తున్న కారు మన్నేరు వద్దకు రాగానే టైర్ పంక్చర్ కావడంతో ప్రమాదం సంభవించింది. కారులో ఉన్న వారికి స్వల్పగాయాలయ్యాయి.

పనులు తనిఖీ చేసిన కేంద్ర బృందం


ఇళ్లను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

హనుమంతునిపాడు: మండలంలో కేంద్ర ప్రభుత్వం నిధులతో జరిగిన పనులను (ఎన్ఎల్ఎం) నేషనల్ లెవల్ మానిటరింగ్ తనిఖీ బృందం ఆదివారం కిష్టంపల్లిలో తనిఖీలు నిర్వహించాయి. ముందుగా వివిధ శాఖల అధికారులు, పంచాయతీ వార్డు సభ్యులు, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వం నిధులతో ఏఏ పనులు జరిగాయో అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులతో జరిగిన అభివృద్ధి పనులు, రోడ్లు, సైడు కాల్వలు, తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన బోర్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో రూ.23 లక్షలతో జరిగిన ఉపాధి పనులు, 2021–22 సంవత్సరం వచ్చిన రూ.7 లక్షల 15వ ఆర్థిక సంఘ నిధులతో గ్రామంలో జరిగిన పనులు పరిశీలించారు. ఈ నిధులతో జరిగిన పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. ప్రధానమంత్రి అవాజ్ యోజన కింద మంజూరైన ఇళ్లను పరిశీలించారు. బిల్లులు వచ్చాయా లేదా అని లబ్ధిదారులతో మాట్లాడారు. బిల్లులు చేసిన ఎం బుక్‌లు, రికార్డులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. బాలింతలకు, గర్భిణులకు కేంద్ర ప్రభుతం అందిస్తున్న పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర విజిటింగ్ టీం కోఆర్డినేటర్ బత్తుల శ్రీనివాసరావు మాట్లాడుతూ తనిఖీ నివేదిక తయారు చేసి అధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ క్రిష్టారావు, ఈఓఆర్డీ షేక్ షరీఫ్, ఏఈ. కొండయ్య, శ్రీకాంత్, తనిఖీ టీమ్ సభ్యులు కిరణ్, రజినీకాంత్, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం నారాయణ, సర్పంచ్ ఉడుముల వెంకటయ్య, కార్యదర్శులు శ్రావణ సంధ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు దిగుబడి ఆశాజనకం

- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- కూలీలకు ఉపాధినిస్తున్న వ్యవసాయ పనులు

మర్రిపూడి: పొగాకు సాగు ఆశాజనకంగా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 21 పంచాయితీల్లో పొగాకు పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది రైతులు అనుకున్నదానికంటే లాభాలు వచ్చే అవకాశం కనిపిస్తోంది.! వ్యవసాయ పనులతో కూలీలకు కూడా ఉపాధి దొరుకుతోంది. ఈ ఏడాది మర్రిపూడి మండలంలో 2 వేల హెక్టార్లలో పొగాకు సాగు చేయాల్సి ఉండగా 3,200 హెక్టార్లలో పంట వేసినట్లు తెలుస్తోంది. పొగాకు నాట్లు వేసిన అనంతరం మాండూస్ తుఫాన్ ప్రభావంతో మండలంలో ఎడతెరిపిలేకుండా వర్షం కురవడం రైతులకు కలిసొచ్చింది. ఆకు రెలపడం ఆలస్యం కావడంతో దిగుబడి పెరిగిపోయింది. పచ్చాకు భారీగా కోతకు రావడంతో రెలిపిన ఆకు బ్యారన్లలో పట్టడం లేదు. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి బ్యారన్ అద్దెకు తీసుకుని క్యూరింగ్ చేయించుకుంటున్నారు. ఈ ఏడాది దిగుబడి బాగా వచ్చిందని క్యూరింగ్ అనంతరం రంగు కూడా బాగానే ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కంది, శనగ, బొబ్బర్లు అనుకున్న స్థాయిలో దిగుబడులు తగ్గినప్పటికీ పొగాకు సాగు ఆశలు రేపింది.


పొగాకును ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న కూలీలు


పొగాకు రెలుపుతున్న ముఠా కూలీలు

కూలీలు ఖుషీ..

ఒక్కో బ్యారన్‌కు ఆకు రెలిపేందుకు రైతులు రూ.1.90 వేలు వరకు ఇచ్చి ముఠాలను నియమించుకుంటున్నారు. బ్యారన్‌లో క్యూరింగ్ చేసేందుకు డ్రైవర్‌కు రూ.30 వేలు రైతులు చెల్లించవలసి ఉంటుంది. ఇసుక దర్శి, వినుకొండ, మార్టూరు, అద్దంకి, తదితర ప్రాంతాల నుంచి రైతులు ముఠాలను తీసుకొచ్చారు. ఒక్కో ముఠాలో 21 మంది కూలీలు పని చేస్తున్నారు. ముఠా కూలీలందరూ 7 బ్యారన్లలో పనిచేసేటట్లుగా ఒప్పందం కుదుర్చుకుంటారు. కూలీలకు ఇచ్చే డబ్బు కాక, మేస్త్రీకి అదనంగా డబ్బు ఇవ్వాల్సి ఉంటుంది. ఆకు రెలిపే దగ్గరనుంచి అల్లకం, బ్యారన్‌లో పెట్టడం, క్యూరింగ్ అనంతరం ఆకు దించి, కట్టలు కట్టి మండెలు వేయడం లాంటి పనులు మూడు నెలలు ఉంటాయి. ఈ మూడు నెలలు కూలీలకు పొగాకు పనులు ఉపాధినిస్తున్నాయి. ఇదిలా ఉండగా మండలంలో తక్కువ విస్తీర్ణంలో పొగాకు సాగు చేసిన కొందరు రైతులు ముఠాలతో కాకుండా ఒకరికొకరు బదులు చేసుకుంటున్నారు.


బంగారు రంగులో దిగుబడి వచ్చి పొగాకును ర్యాకుల్లో పెట్టిన దృశ్యం

డంపింగ్ యార్డ్‌లో మంటలు

సుమారు 20 టన్నుల చెత్త దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కనిగిరి రూరల్: పట్టణంలోని కంభం రోడ్డు పెద్ద చెరువు వద్ద ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డ్‌లో ఆదివారం రాత్రి మంటలు రేగాయి. అగ్ని ప్రమాదంలో సుమారు 20 టన్నుల చెత్త తగలబడింది. అగ్నిమాపక వాహనం సిబ్బంది మంటలు ఆర్పారు. అప్పటికి చెత్త ఎక్కువ భాగం కాలి బూడిదైంది. ఎవరో ఆకతాయిలు చేసిన చర్యగా తెలిసింది.


చెల రేగుతున్న మంటలు

వైభవంగా పోలేరమ్మకు పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో కామేపల్లి పోలేరమ్మ తల్లి


వల్లూరులో ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ

సీఎస్‌పురం: మండలంలోని జంగంవారిపల్లిలో పోలేరమ్మ పొంగళ్ల కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. జంగంవారిపల్లిలో పట్టాభిరామచంద్ర స్వామి తృతీయ వార్షిక వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆదివారం పోలేరమ్మకు పొంగళ్లు చేపట్టారు. పూసల బండి కట్టి మహిళలు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు చేరారు. అక్కడ పొంగళ్లు తయారు చేసి, పోలేరమ్మకు ప్రత్యేక పూజలు చేసి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా పోలేమ్మకు పొంగళ్లు

కొండపి: జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలో ఆదివారం పోలేరమ్మకు భక్తులు ఘనంగా పొంగళ్లు పెట్టుకున్నారు. భక్తుల సందర్శనార్థం అమ్మవారిని పూలదండలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు దేవస్థానం పాలక మండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వల్లూరమ్మ ఆలయంలో పూజలు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజ, గోత్రనామార్చన చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వల్లూరమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, ఆలయ ఈఓ రమేష్, ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకుడు ఉమాశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.


పోలేరమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


బండ్లు కట్టి పొంగళ్ల సామగ్రితో ఆలయం వద్దకు వెళుతున్న భక్తులు

వృథాగా పోతున్న పాతచెరువు నీరు


పామూరు పాతచెరువు తూము నుంచి వృథాగా పోతున్న నీరు

పామూరు: పామూరుకు నీటి అవసరాలను తీర్చే పాతచెరువు నీరు అధికారుల తీరుతో వృథాగా పోతోంది. గుర్తుతెలియని వ్యక్తులు రాత్రివేళల్లో అక్రమంగా చెరువు తూములను ఎత్తివేసి నీటి వృథాకు కారణమవుతున్నారు. విషయం పంచాయతీ అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ చెరువు కిందిభాగంలో బోర్లువేసే పామూరులోకి పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా చేస్తారు. అదృష్టవశాత్తు వర్షాలు పడి చెరువులో నీరు ఉండగా ఈ నీరు నిల్వ ఉంచితే వచ్చే వేసవికి ఎలాంటి నీటి ఇక్కట్లు లేకుండా చూడొచ్చు. అయితే అందుకు విరుద్ధంగా నీటి చౌర్యం జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తక్షణం నీటి విడుదలను అడ్డుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- కాఫీ విత్ గృహ సారథిలో అశోక్‌బాబు


టంగుటూరులో గృహసారథితో మాట్లాడుతున్న అశోక్‌బాబు

టంగుటూరు: వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోనే తొలిసారిగా చేపట్టిన కాఫీ విత్ గృహసారథి కార్యక్రమం ఆదివారం టంగుటూరులోని చెల్లెమ్మతోటలో నిర్వహించారు. గృహసారథి పాసర్లపూడి నాగమణి ఇంటికి వెళ్లి క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై సూచనలిచ్చారు. క్లస్టర్ పరిధిలో ప్రజా సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. గృహసారథికి పార్టీ నాయకులను పరిచయం చేశారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, బీసీడీ ఉదయకుమార్, పమిడి రాఘవయ్య, రావి వెంకటేశ్వర్లు, బొడ్డు రవీంద్ర, ఎంపీటీసీ కొమ్ము ప్రబుదాసు, దాసరి సుబ్బారావు, కసుకుర్తి శ్రీనివాసరావు, పులిచర్ల కొటయ్య, బిల్లా అనీల్, షేక్ అలగ్జాండర్, దుగ్గిరాల పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామికి 108 ప్రసాదాలు


ప్రసాదాలు నైవేద్యంగా పెట్టిన దృశ్యం

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని కోదండరామస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి గోదాదేవి అమ్మవారికి 16 రోజుల పండుగ సందర్భంగా 108 ప్రసాదాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు 108 ప్రసాదాలు తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో భాగంగా కోదండరాముల వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మహాసభలను జయప్రదం చేయాలి

సీఎస్‌పురం: సీఐటీయూ మండల మహా సభలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు డి.తిరుపతయ్య, ఎస్ తిరుపతిరెడ్డి కోరారు. సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఫిబ్రవరి 5వ తేదీన సీఐటీయూ మండల మహాసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షునిగా సూర్యనారాయణ



ఎన్నికైన గుడ్లూరు మండల యూటీయఫ్ కమిటీ

గుడ్లూరు: యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల నూతన అధ్యక్షునిగా ఎస్.సూర్యనారాయణ ఎన్నికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడ్లూరు మండల శాఖ సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శులు మధు, సతీష్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా పి.మనోహరం, అధ్యక్షునిగా సూర్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా వై.మాల్యాద్రి, ఎస్.ప్రసన్నకుమారి, ప్రధాన కార్యదర్శిగా మక్కెన రమేష్‌బాబు, కోశాధికారిగా కె.శ్రీనివాసులురెడ్డి, ఆడిటర్లుగా రాజేంద్రప్రసాద్, కార్యదర్శులుగా రాధ, మాలకొండయ్య, కుమారస్వామి, ఈశ్వరరెడ్డి, కిశోర్‌కుమార్, ప్రసాద్, రసూల్ భాషా, శ్రీనివాసులు, మల్లికార్జునను ఎన్నుకున్నారు. అనంతరం పదోన్నతి పొంది ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రమౌళీశ్వర్, ప్రధానోపాధ్యాయులు సలీంబాషా, శ్రీనివాసులు, రామ్మోహన్. యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కిలారి వెంకటేశ్వర్లు, జేవీవీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణకుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉలవపాడులో..

ఉలవపాడు: యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మీర్ మెమోరియల్ స్కూల్ ఆవరణలో ఎన్నిక నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడిగా జి. నాగేంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.జాలయ్య, కోశాధికారిగా కె.రమేష్, గౌరవ అధ్యక్షులుగా ఎల్.వేణుగోపాల్, సహాధ్యక్షులుగా జాలయ్య, విజయలక్ష్మి, జిల్లా కౌన్సిలర్లుగా విజయలలిత, బి.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసులు, మురళీకృష్ణ, మహిళా కమిటీ కన్వీనర్‌గా సుబ్బమ్మ, సుప్రజ, ఆడిట్ కమిటీకి ఎమ్.శ్రీనివాస్, కుటుంబ సంక్షేమానికి రమేష్‌బాబు, సాంస్కృతిక విభాగానికి యస్దాని, శ్రీధర్‌రెడ్డి తోపాటు ఈసీ మెంబర్లను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి సతీష్ ఆధ్వర్యంలో ఈ కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు.

6న నవజాత శిశు స్థిరీకరణ యూనిట్ ప్రారంభం


ప్రారంభానికి సిద్ధమైన ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాల

ఉలవపాడు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నవజాత శిశు స్థిరీకరణ యూనిట్(ఎన్‌బీఎస్‌యూ)ను ఫిబ్రవరి 6వ తేదీన ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి ప్రారంభించనున్నట్లు వైద్యాధికారి సతీష్‌బాబు తెలిపారు. ఉలవపాడు వైద్యశాలలో ప్రసవాలు అధికంగా జరుగుతుండటం, చిన్న పిల్లల ఓపీలు అధికంగా ఉండటంతో ప్రభుత్వం ఎన్‌బీఎస్‌యూను మంజూరు చేసింది. ఇక్కడ యూనిట్ ఏర్పాటు అవసరాన్ని ఎమ్మెల్యే మహీధర రెడ్డి రాష్ట్ర వైద్యశాఖ ఉన్నతాధికారులకు వివరించడంతో వెంటనే నిధులు విడుదల చేశారు. ఇకపై నవజాత శిశువులు, చిన్నారులకు మరింత మెరుగైన వైద్యం అందించడానికి వీలవుతుందని డాక్టర్ సతీష్ పేర్కొన్నారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరం


మాట్లాడుతున్న న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ నటరాజ్‌కుమార్

టంగుటూరు: చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉంటే సమస్యలు వచ్చినప్పుడు ఎదుర్కోవడానికి అవకాశం ఉంటుందని ఒంగోలు ఇందిరా ప్రియదర్శని న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నటరాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని వల్లూరు గ్రామంలో న్యాయ కళాశాల 3వ సంవత్సరం విద్యార్థులు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. భారతదేశ చట్టాలపై సరైన అవగాహన లేక బాధితులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాలం చెల్లిన చట్టాల స్థానంలో నూతన చట్టాల రూప కల్పనకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని, వాటిపై న్యాయ విద్యార్థులు, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సి.వి.రామకృష్ణారావు, రిటైర్డ్ ఏఎస్పీ సుంకర సాయిబాబు, సర్పంచ్ వల్లూరి పద్మ, ఎంపీటీసీ యలసిరి సత్యవాణి, మాజీ సర్పంచి కుందం హనుమారెడ్డి, వల్లూరమ్మ దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఆళ్ల హరిబాబు, కుందం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భౌతికకాయం మెడికల్ కళాశాలకు అప్పగింత


కొండయ్య భౌతిక కాయం వద్ద కుటుంబ సభ్యులు


కొమ్మిరెడ్డి కొండయ్య (ఫైల్)

కనిగిరి రూరల్: పట్టణంలోని ఇందిరాకాలనీలో మృతి చెందిన కొమ్మిరెడ్డి కొండయ్య (70) భౌతిక కాయాన్ని కుటుంబసభ్యులు మెడికల్ కళాశాలకు అప్పగించారు. వివరాల్లోకి వెలితే కొమ్మిరెడ్డి కొండయ్య కుమార్తె కొండమ్మ వైద్య,ఆరోగ్య శాఖలో పనిచేస్తూ, జన విజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా సమతా నాయకురాలిగా ఉన్నారు. ఆమె తండ్రి కొండయ్య బతికి ఉండగానే వారిరువురు అవయవ దానంపై చర్చించుకున్నారు. అందుకు తన తండ్రి అంగీకరించినట్లు చెప్పారు. ఈమేరకు ఆదివారం కొండయ్య మృతి చెందడంతో కుటుంబసభ్యుల సమ్మతితో అమలాపురం మెడికల్ కాలేజీకి భౌతిక కాయాన్ని అప్పగించారు. భవిష్యత్‌లో తాను, తన చెల్లెలు మరణించినా భౌతికకాయాలను కూడా మెడికల్ కాలేజీకే అప్పగించేందుకే అంగీకారం తెలిపినట్లు వెల్లడించారు. జేవీవీ వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావుల స్ఫూర్తితో తండ్రి భౌతికకాయాన్ని దానం చేస్తున్నట్లు తెలిపారు. కొండమ్మ తీసుకున్న నిర్ణయం పట్ల జేవీవీ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాల వారు అభినందనలు తెలిపారు. కొండయ్య భౌతికకాయాన్ని మదర్‌థెరిస్సా సంస్థ, మనవతా సంస్థ కమిటీ నాయకులు సయ్యద్ నాయబ్ రసూల్, పసుపులేటి అరుణోదర్, ఈర్ల విజయరామ రాజు, ఉమాకాంత్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.



